తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
బుధవారం
5 ఆగస్టు 2026
పేజీలు : 08





## 480 గృహాలకు దరఖాస్తుల ఆహ్వానం

### పోచారంలో ఇందిరమ్మ వన్‌బీహెచ్‌కే ఫ్లాట్లు

- రూ.5 లక్షల ప్రభుత్వ సబ్సిడీ.. లాటరీ ద్వారా ఎంపిక
- ఆగస్టు 10 వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రతి ఫ్లాట్ విలువ రూ.11 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందించనుంది. భూమిని ఉచితంగా కేటాయించడంతో లబ్ధిదారులు కేవలం రూ.6 లక్షలు మాత్రమే దశలవారీగా చెల్లించాల్సి ఉంటుంది. తొలి దశలో నాలుగు టవర్లను భూతలం ప్లస్ 10 అంతస్తుల నమూనాలో నిర్మిస్తున్నారు. ప్రతి అంతస్తులో 12 ఫ్లాట్లు ఉండగా, ఒక్కో ఫ్లాట్‌కు 400 చదరపు అడుగుల కార్పెట్ విస్తీర్ణం, 528 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణం కల్పిస్తున్నారు.లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా లాటరీ విధానంలో పారదర్శకంగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసిన తర్వాత తుది కేటాయింపు చేపడతారు. తాత్కాలిక కేటాయింపు సమయంలో రూ.1 లక్ష, ఆర్‌సీసీ నిర్మాణం పూర్తైన తర్వాత మరో రూ.1 లక్ష, చివరి దశ పనుల సమయంలో రూ.2 లక్షలు, గృహం అప్పగించే సమయంలో మిగిలిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

**ఘట్కేసర్, ఆగస్టు 4 (జనంసాక్షి):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ వన్‌బీహెచ్‌కే గృహ టవర్ల పథకం కింద మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మిస్తున్న గృహాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. తొలి విడతలో నిర్మిస్తున్న 1,440 గృహాల్లో భాగంగా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారంలో 480 నాణ్యమైన ఫ్లాట్లను అర్హులకు కేటాయించనున్నారు. ఆసక్తి గల కుటుంబాలు రూ.100 దరఖాస్తు రుసుముతో ఆగస్టు 10 సాయంత్రం 5 గంటలలోపు మీ సేవ కేంద్రాలు, మీ సేవ పోర్టల్ లేదా మీ సేవ వాట్సాప్ నంబర్ 8096958096 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు గత పదేళ్లుగా సంబంధిత పరిధిలో నివసిస్తూ ఉండాలి. అదే అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వారై ఉండటంతో పాటు గతంలో ప్రభుత్వ గృహ పథకాల ద్వారా లబ్ధి పొందకూడదు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఇల్లు లేదా స్థలం ఉండరాదు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలలోపు ఉండాలి. కేటాయించిన ఫ్లాట్‌ను పదేళ్లపాటు విక్రయించకూడదు, అద్దెకు ఇవ్వకూడదని నిబంధనలు పేర్కొన్నాయి. రిజర్వేషన్‌లో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం, ప్రభుత్వ, ఔట్‌సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు 10 శాతం, సాధారణ కేటగిరీకి 50 శాతం కేటాయిం చారు. అన్ని వర్గాల్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్ కల్పించారు. అర్హత ఉన్న కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీతో సొంతింటి కలను సాకారం చేసుకోవాలని అధికారులు కోరారు.

## భరోసా కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### మహిళల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

**జవాబుదారితనంతో సేవలందించండి : వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా**



**వికారాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 4 (జనం సాక్షి):**

అధికారులు సమన్వయంతో భరోసా కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. మంగళవారం జిల్లా మహిళ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌లోని పనితీరు, నమోదైన కేసుల విచారణ పురోగతి, మహిళా బాధితులకు అందిస్తున్న సేవలు రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆమె సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల ప్రస్తుత స్థితి, దర్యాప్తు పురోగతి, బాధితులకు అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్ ప్రక్రియ భరోసా కేంద్రంతో అధికారుల సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ... మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస, కట్న వేధింపులు వంటి ఫిర్యాదులపై అధికారులు అత్యంత సున్నితంగా, వేగవంతంగా స్పందించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును చట్టపరంగా, నిష్పక్షపాతంగా విచారించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు లోపలి పేజీలో

## అందని ద్రాక్షగా మారిన రైతు బీమా పథకం

**ప్రభుత్వ జాబ్ ఓల్డార్ జామీను ప్రదానం చేసిన అధికారులు**
**జామీను వేతన రసీదులు ఇవ్వకపోవడంతో నిలిచిపోయిన దరఖాస్తులు**
**సతమతం అవుతున్న రైతు బీమా లబ్ధిదారులు**

లోపలి పేజీలో



లోపలి పేజీలో

## ప్రతి నీటి బొట్టు విలువైనదే వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**క్యాచ్ ద రెయిన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమతా వెంకట్ రెడ్డి, కమిషనర్ యాదగిరి**

## శేరిలింగంపల్లిలో పారదర్శక పాలనకు ప్రాధాన్యం

### పెండింగ్ ఫైళ్లకు త్వరితగతిన పరిష్కారం

- అభివృద్ధి పనులు, బడ్జెట్ కేటాయింపులపై సమీక్ష
- ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం
- ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచన

లోపలి పేజీలో




## అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సహాయ సహకారాలు అందిస్తా

- మండల స్థాయి సమీక్ష సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- విద్యుత్ అధికారులపై సర్పంచుల ఆగ్రహం

లోపలి పేజీలో





## వైఎస్సార్ పార్క్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, ఆగస్టు 4 (జనం సాక్షి):** వైఎస్సార్ పార్క్ అభివృద్ధి పనులను వేగవంతం గా పూర్తి చేయాలని, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా పార్కును అభివృద్ధి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులకు సూచించారు. మేరకు మంగళవారం ముషీరాబాద్ డివిజన్ పరిధిలోని వైఎస్సార్ పార్క్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన, మిగిలిన పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షుడు కొండ శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి ఆకుల అరుణ్, మీడియా ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్ గౌడ్, బస్తీ మహిళలు, డీఈ గీత, హార్టికల్చర్ అధికారులు చంద్రశేఖర్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

## బీబీ రాంజీ ఎఫ్‌టిఐ ఉద్యోగస్తుల సమ్మె



**మోమిన్ పేట ఆగస్టు 4( జనం సాక్షి) :** మోమిన్ పేట్ మండలకేంద్రంలో బి జి రాంజీ ఉద్యోగస్తుల సమ్మె బాట పట్టారు నెలల తరబడి పని చేస్తున్న ప్రభుత్వం మాత్రం సకాలంలో జీతాలు ఇవ్వడం లేదు గత రెండు దశాబ్దాలుగా గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలలో నిరంతరం సేవలందిస్తున్న ఎఫ్ టి ఈ ఉద్యోగులం అయినప్పటికీ గత సంవత్స ర కాలంగా ఉద్యోగుల వేతనాలు మూడు నెలల జీతాలు ఆలస్యంగా చెల్లించబడుతున్నాయి. ప్రస్తుతం కూడా మూడు నెలల వేతనలు పెండింగ్లో ఉండటంతో ఉద్యోగులు మరియు వారి ఆర్థిక మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూల్ మరియు కళాశాల పిజులు ఇంటి అద్దె బిల్లులు ఈఎంఐ లు వంటి అత్యవసర ఖర్చులను కూడా భరించలేని పరిస్థితి నెలకొంది. ఎన్ని సార్లు ఉన్నత అధికారులకు వినతి పత్రం అందించిన లాభం లేదు విజి రాంజీ ఉద్యోగుల వేతనాలు 2026ఆగస్టు 15 నాటికి పే స్కేల్ అమలు చేయాలి పెండింగ్లో ఉన్నా వేతనాలు వెంటనే విడుదల చేయాలి ఎస్ ఆర్ డి ఎస్ బోర్డు సమావేశంలో ఆమోదించిన అన్ని నిర్ణయాలు తక్షణమే అమలు చేయాలి సెలవు దినాల్లో కూడా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులు గా గుర్తించాలి అని డిమాండ్ తెలిపారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

### టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలి జనార్దన్



**కొడంగల్ ,ఆగస్టు 04 (జనం సాక్షి):** బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్ అమలు చేసి సామాజిక న్యాయం చేయాలని టీఆర్ఎస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలి జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం కొడంగల్ పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న సంకల్ప సభకు పార్లమెంట్ పరిధిలోని వేలాది మంది ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారని తెలిపారు. విద్య, ఉపాధి, రైతులకు న్యాయం, బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించడం ఈ సభ ప్రధాన ఎజెండా అని స్పష్టం చేశారు.దేశంలో బీసీల జనాభాకు అనుగుణంగా 50 శాతం రిజర్వేషన్ అమలు చేసినప్పుడే వారికి నిజమైన సామాజిక, రాజకీయ న్యాయం జరుగుతుందని అన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో బీసీలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వివిధ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు.

# శ్రీ నగరేశ్వర దేవాలయ నూతన పాలకమండలి చైర్మన్‌గా దేవగారి రమేష్ కుమార్ పేరు ఖరారుకు సన్నాహాలు

### ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హామీ



**తాండూరు అగస్టు4 (జనంసాక్షి)** తాండూర్‌లోని ప్రసిద్ధ శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీ వాసవి మాత ఆలయ పాలకమండలి గడువు ముగియడంతో నూతన పాలకమండలి ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో ఆలయ చైర్మన్ పదవికి కాంగ్రెస్ యువ నాయకులు, ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ సభ్యులు దేవగారి రమేష్ కుమార్ పేరును పార్టీ పెద్దలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు దేవగారి రమేష్ కుమార్ మాట్లాడుతూ, పాలకమండలి ఇది ప్రభుత్వ పార్టీ నామినేటెడ్ పోస్ట్ అని, నిజమైన కార్యకర్తగా పార్టీకి, ప్రభుత్వానికి విధేయుడిగా పనిచేశానని తెలిపారు. తన స్వగ్రామంతో పాటు తాండూర్ సాయిపూర్ కాలనీలో సర్పంచ్, కౌన్సిలర్ స్థానాల్లో పార్టీ ఇన్చార్జిగా ఉండి విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించానని చెప్పారు.

తనపై నమ్మకంతో స్థానిక శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి బాధ్యత అప్పగించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకున్నానని అన్నారు. ఆలయ పునర్నిర్మాణంపై ఆయన మాట్లాడుతూ, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పురాతన శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీ వాసవి మాత సమేత ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గారు అనుమతులు ఇప్పించి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. ఎలాంటి విఘ్నాలు లేకుండా విఘ్నేశ్వరుని, వాసవి మాత, నగరేశ్వర స్వామి ఆశీస్సులతో పునర్నిర్మాణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేస్తామని అన్నారు. ఈ బాధ్యతల్లో తనకు సహకరించిన సంఘ పెద్దలు, సభ్యులు, రాజకీయ సీనియర్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేకంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గారికి, =దీూా చైర్మన్ శ్రీ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి గారికి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ శ్రీమతి కల్వ సుజాత గారికి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ధారాసింగ్ గారికి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి నీరజ బాల్రెడ్డి, మార్కెట్ చైర్మన్ పట్లోల నర్సింలు, తాండూర్ టౌన్ ప్రెసిడెంట్ బాతుల నాగు గారితో పాటు పార్టీ సీనియర్ నాయకులకు, సంఘ పెద్దలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గం క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని, సంఘం, పాలకమండలి, దాతలు, పురోహితులు, సంఘ పెద్దల సలహాలు, సూచనలతో ముందుకు వెళ్తామని దేవగారి రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వికారాబాద్ జిల్లా కార్యదర్శిగా బాల్ రెడ్డి



**కొడంగల్, ఆగస్టు04(జనం సాక్షి):** కొడంగల్ మండలం ఇందనూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బాల్ రెడ్డిని వికారాబాద్ జిల్లా కార్యదర్శిగా పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మరింత చేరువగా ఉండి పార్టీ కోసం మరింత సేవ చేస్తానని పేర్కొన్నారు.

## కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపిన యాదిరెడ్డి కుటుంబ సభ్యులు



**మొయినాబాద్, ఆగస్టు04, జనంసాక్షి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, ఢిల్లీలో చెట్టుకు ఉరివేసుకొని అమరుడైన కీర్తిశేషులు మందాడి యాదిరెడ్డి ఇంటికి ఇటీవల కేటీఆర్ వెళ్లారు. ఆ సమయంలో యాదిరెడ్డి సోదరుని కూతురికి గొంతు ఆపరేషన్ అవసరమని తెలుసుకుని, కేటీఆర్ పాపకి శస్త్రచికిత్స చేయించారు. ఈ గొప్ప సహాయానికి కృతజ్ఞతగా.. సోమవారం సబితా ఇంద్రారెడ్డితో కలిసి యాదిరెడ్డి కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు అనంత్ రెడ్డి గారు, మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి,నాయకులు నర్సింహారెడ్డి, మాణిక్ రెడ్డి, కేటీఆర్ ఇంటికి వెళ్లి ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పాడి పరిశ్రమను బలోపేతం చేస్తాం

### రైతులు పొదుపు మహిళలకు అదనపు ఆదాయం

### అదనపు డైరెక్టర్ సుబ్బారాయుడు

**కొడంగల్, ఆగస్టు 4 (జనం సాక్షి):** కొడంగల్ నియోజకవర్గంలో పాడి పరిశ్రమ అభివృద్ధి, రైతుల ఆదాయ పెంపు, మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా డెయిరీ అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు అదనపు డైరెక్టర్ సుబ్బారాయుడు, సెర్ఫ్ డైరెక్టర్ రాజేశ్వర్, ఎన్ డి డి బి ప్రతినిధి అమిత్, డి ఆర్ డి ఏడైరెక్టర్,అసిస్టెంట్ డైరెక్టర్ నూహ్, కొడంగల్ ఏడిఏ నోహ ,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు పరమేశ్వర్, ప్రమీల,. వరలక్ష్మి, జీ వి వో వెంకటయ్య, ఎల్ ఎస్ ఏ శేఖరయ్య తదితర అధికారులు నియోజకవర్గంలో పర్యటించి ఫీల్డ్ స్టడీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గోపాలమిత్రలతో సమావేశమై పాడి పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అవకాశాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పాల ఉత్పత్తి, పశుగ్రాసం, పశువైద్య సేవలు, మార్కెటింగ్ తదితర అంశాలపై వివరాలు సేకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో డెయిరీ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు అదనపు ఆదాయం కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డెయిరీ అభివృద్ధి పథకాలను రైతులకు చేరువ చేసి, మహిళాసంఘాల భాగస్వామ్యంతో పాడి పరిశ్రమను లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పాల ఉత్పత్తి పెంపు, నాణ్యమైన పశువుల పెంపకం, పశువైద్య సేవల విస్తరణ, పశుగ్రాస అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు,గోపాలమిత్రలు, రైతులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి డిగ్రీ కళాశాలలో సీపీఆర్ అవగాహన సదస్సు




**మల్కాజిగిరి ఆగస్టు 4(జనంసాక్షి)**అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు లేదా శ్వాస ఆగిపోయిన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసస్సిటేషన్) అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని 'సెయింట్ జాన్ అంబులెన్స్ ఇండియా' సీనియర్ ఫ్యాకల్టీ కలారి సంతోష్ కుమార్ తెలిపారు.మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో సీపీఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు, ప్రతి పౌరుడూ తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన ప్రాణరక్షక నైపుణ్యం సీపీఆర్ అని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్స్ వచ్చేలోగా బాధితుడికి సీపీఆర్ అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు.అనంతరం విద్యార్థులకు సీపీఆర్ చేసే సరైన విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి, వారి చేత సాధన చేయించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు ఇటువంటి జీవన నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాలని, సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎడ్ల ప్రదీప్, డాక్టర్ హరిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రాజేశ్‌కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ గుణాకర్, డాక్టర్ మల్లిక, ఇతర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**మోమిన్ పేట్ ఆగస్ట్ 4( జనం సాక్షి)**ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు.మంగళవారం మోమిన్ పేట మండలం 75 వార్డులో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ఇంటింటి సర్వే తీరును క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. ఎన్ని ఫారాలు ఇచ్చారు, కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, కుటుంబ సభ్యులు ఒకే పి ఎస్ లో ఉన్నారా, కుటుంబ సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు బిఎల్ఓ ప్రతి ఇంటికి తిరిగి అందించాలని కలెక్టర్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఉర్దూ మాట్లాడే ప్రజలు ఉన్న చోట ఉర్దూ ఫారాలు వారికి అందజేయాలని ,ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన బిఎల్ఓ లకు సూచించారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత బిఎల్ఓ లదేనని కలెక్టర్ తెలిపారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వివరాలను సరిచూసుకోవాలని కలెక్టర్ సూచించారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు గర్ల్స్ , బాయ్స్, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సంబంధించిన వంటకాలను పరిశీలించారు. కిచెన్ షెడ్, ఆహార పదార్థాలను పరిశీలించి , విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని అధికారులకు సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా తరగతిలో బోధన విధానాన్ని, హాజరు శాతాన్ని పరిశీలించారు.మోమిన్ పేట్ మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయలన్నారు. ఆసుపత్రిలో కావలసిన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆసుపత్రికి వచ్చిన రోగులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, ఇన్ పేషెంట్ వార్డు, వార్డు గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మున్నిరుద్దిన్, సివిల్ సర్జన్ బుచ్చి బాబు ,,ఎం పి డి ఓ రాజ మల్లయ్య, సర్పంచు సంధ్యా సుభాష్ గౌడ్ , బి ఎల్ ఓ లు , స్కూల్ ప్రదానోపద్యాయులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తాండూర్‌లో బీఆర్ఎస్ సర్ సమీక్ష.. 71శాతం డిజిటలైజేషన్ పూర్తి

### బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల



**తాండూరు ఆగస్టు 4 (జనంసాక్షి)** తాండూర్‌లో బీఆర్ఎస్ సర్ సమీక్ష.. 71శాతం డిజిటలైజేషన్ పూర్తి అయిందనినియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీశైల్ రెడ్డి పంజుగుల అన్నారు. మంగళవారం తాండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయంలో శ్రీశైల్ రెడ్డి పంజుగుల అధ్యక్షతన సర్ పై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పిలుపు మేరకు సర్ పై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారని చెప్పారు. ఆర్డీవో లెక్కల ప్రకారం నియోజకవర్గంలో దాదాపు 71 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.తాండూర్ పట్టణంలో బోగస్ ఓట్లు, డబుల్ ఓట్లు, మృతుల ఓట్లు, ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ అయిన ఓట్ల పరిశీలన ఎక్కువగా ఉండటంతో ప్రక్రియ కొంత ఆలస్యమవుతోందని శ్రీశైల్ రెడ్డి తెలిపారు. మిగిలిన ఆరు రోజుల గడువులో పార్టీ శ్రేణులు మరింత అప్రమత్తంగా పనిచేస్తున్నాయని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బీఆర్ఎస్



నాయకులు, కార్యకర్తలు సర్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొంటున్నారని తెలిపారు.అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాస్వామ్య ప్రక్రియపై విశ్వాసంతో బీఆర్ఎస్ పనిచేస్తుందన్నారు. పార్టీ అధిష్ఠానం, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు సర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు పాల్గొంటున్నాయని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా సర్ ప్రక్రియ పకడ్బందీగా జరగాలన్న కేసీఆర్ ఆలోచన మేరకు పనిచేస్తున్నామని పేర్కొన్నారు.ఇప్పటికీ ఎన్యుమరేషన్ ఫామ్‌లు తిరిగి ఇవ్వని వారు వెంటనే అందజేయాలని తాండూర్ ప్రజలను కోరారు. తాండూర్‌లో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఓటు ఉన్నవారు అక్కడి ఓటును రద్దు చేయించుకుని తాండూర్‌లోనే ఓటు పొందాలని సూచించారు. మిగిలిన గడువును సీరియస్‌గా తీసుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు శ్రీశైల్ రెడ్డిపంజుగుల పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తల్లారం, తంగడిపల్లి పాఠశాలల్లో ఏకరూప దుస్తుల పంపిణీ



**చేవెళ్ల, ఆగస్టు 04 (జనంసాక్షి)** చేవెళ్ల మండల పరిధిలోని తల్లారం ప్రాథమిక పాఠశాల, తంగడిపల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. తల్లారం ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ కావలి లక్ష్మీప్రసన్న శేఖర్ విద్యార్థులకు యూనిఫాంలను అందజేయగా, తంగడిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో గ్రామ సర్పంచ్ పామెన రాములు, ప్రధానోపాధ్యాయుడు గోపాల్ కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. తల్లారం గ్రామంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రీ-ప్రాథమిక పాఠశాల ప్రారంభమైనందున నాలుగేళ్లు నిండిన చిన్నారులందరినీ అందులో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తల్లారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయుడు క్రిష్ణయ్య, ప్రీ-ప్రాథమిక పాఠశాల ఆయా వరలక్ష్మి, వార్డు సభ్యుడు రమేష్, గ్రామ కార్యదర్శి రోషన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అరుణాచలం ప్రత్యేక బస్సునుప్రారంభించిన



### మున్సిపల్ చైర్‌పర్సన్ నిరజాబాల్ రెడ్డి

**తాండూరు అగస్టు 4(జనంసాక్షి)**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో తాండూరు నుండి అరుణాచలం వెళ్లే ప్రత్యేక బస్సును మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో మేలు జరుగుతుందని,తాండూర్ నుంచి అరుణాచలం బస్సు సౌకర్యం కల్పించడం సంతోషకరమైన విషయమన్నారు.ఈ బస్సు సౌకర్యంను తాండూర్ ప్రజలు, పరిసరాల ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని కోరారు.భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణ సేవలు అందించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం అభినందనీయమని చైర్‌పర్సన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశం, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలి

### బస్ భవన్ వద్ద ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల భారీ నిరసన



ముషీరాబాద్, ఆగస్టు 04 (జనం సాక్షి):ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు రావలసిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని వారి డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ కార్మికులు మంగళవారం చలో బస్ భవన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో బస్ భవన్‌కు చేరుకొని తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. నిరసన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ, రిటైర్మెంట్ కార్మికులకు రావలసిన 2017, 2021 సంవత్సరాల బకాయిలు త్వరగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ హాస్పిటల్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు 2 నెలలకు సరిపడా మందులు అందించాలన్నారు. వితంతు ఉద్యోగులకు ాఖీ, గ్రాట్యుటీ, పెన్షన్ కేసుల ఈ నిరసనలో వివిధ జిల్లాల నుంచి రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి నీటి బొట్టు విలువైనదే వర్షపు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **క్యాచ్ ద రెయిన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమతా వెంకట్ రెడ్డి, కమిషనర్ యాదగిరి**



**చేవెళ్ల, ఆగస్టు 04 (జనంసాక్షి) :** ప్రతి నీటి బొట్టు విలువైనదేనని వర్షపు నీటిని ఒడిసిపట్టి భవిష్యత్ తరాలకు నీటిని కాపాడుకుందామని చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థుల్లో వర్షపు నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో చేవెళ్ల మోడల్ స్కూల్‌లో "క్యాచ్ ద రెయిన్" వర్షపు నీటిని ఒడిసిపట్టుకుందాం అనే అంశంపై మంగళవారం వ్యాసరచన పోటీ నిర్వహించారు. పురపాలక సంఘం కమిషనర్ బి.యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి చేవెళ్ల పురపాలక సంఘం చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షపు నీరు ప్రకృతి మనకు అందించే అమూల్యమైన సహజ వనరు. ఇది భూగర్భ జలాలను పెంచడానికి, తాగునీటి కొరతను తగ్గించడానికి, వ్యవసాయానికి పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వర్షపు నీటిని చెరువులు, కుంటలు, ఇంకుడు గుంతలు, ఇంటి పైకప్పు పై వర్షపు నీటి సేకరణ పద్ధతుల ద్వారా నిల్వ చేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నీటి బొట్టు అమూల్యమైందని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భవిష్యత్ తరాలకు నీటిని కాపాడుకుందామని అన్నారు. అనంతరం కమిషనర్ యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు వర్షపు నీటి సంరక్షణ ప్రాముఖ్యతను తెలుసుకుని తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి వనరులను కాపాడవచ్చని అన్నారు. చిన్నప్పటి నుంచే నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించుకొని, తమ ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ చర్యలను అమలు చేయాలని విద్యార్థులకు సూచించారు. వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వర్షపు నీటి సంరక్షణ ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ, నీటి వృథాను నివారించే మార్గాలపై తమ అభిప్రాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లు ఉమేందర్ సింగ్, నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పురపాలక సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులను "క్రిమినల్ వేస్ట్" అంటూ అవహేళన చేయడం సిగ్గుచేటు

- **సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలి:**
- **బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం**

**యాచారం, ఆగస్టు 04(జనం సాక్షి) :**
తెలంగాణ ఇంజనీరింగ్ విద్యార్థులను "క్రిమినల్ వేస్ట్" అంటూ అవహేళన చేస్తూ మాట్లాడిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాష్ట్రంలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు బహిరంగంగా, బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పగడాల శ్రీశైలం మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని ఆధునిక సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులను అవమానించే విధంగా ముఖ్యమంత్రి మాట్లాడటం అత్యంత బాధాకరమని అన్నారు. విద్యార్థుల కష్టాలు, వారి భవిష్యత్తు, ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.క్రిమినల్ వేస్ట్ వంటి వ్యాఖ్యలు తెలంగాణ విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయ ని, ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని శ్రీశైలం డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విద్యా ర్థులు, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరి స్తోందని విమర్శించారు. విద్యార్థులకు సంబంధిం చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్ మెంట్ ఆలస్యం కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలో పేదల భూములకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం, భూవివాదాలు మరియు భూముల సమస్యల విషయంలో పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ విద్యార్థుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం

**హయత్ నగర్, జనంసాక్షి) :** యశోద హాస్పిటల్స్ సౌజన్యంతో హయత్‌నగర్, సూర్య నగర్ కాలనీ, రోడ్ నెం.4లోని శ్రీసాయి తేజస్వి పాలి క్లినిక్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్, మెడ్‌ప్లస్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జక్కి వీరస్వామి తెలిపారు. ఈ శిబిరం తేదీ: 05-08-2026, బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగనుంది. శిబిరంలో గుండె సంబంధిత సమస్యలను గుర్తించేందుకు రక్తపోటు (బీపీ), షుగర్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. డాక్టర్ కన్సల్టేషన్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అవసరమైన వారికి 2డీ ఎకో పరీక్షను సైతం ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, అనుమానం ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# భరోసా కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలి

తీసుకోవాలన్నారు. కేసుల విచారణలో ఎలాంటి ఆలస్యం వహించకూడదని, క్షేత్రస్థాయి ఆధారాలను సేకరించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, బాధితులకు సైకలాజికల్ కౌన్సెలింగ్ అందించడంలోనూ, వారికి పునరావాసం కల్పించడంలోనూ భరోసా కేంద్రాల సేవలను సమర్థవంతంగా వాడుకోవాలని సూచించారు.స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల సరైన నిర్వహణ, డిజిటల్ నమోదు విధానం సిబ్బంది పనితీరును పరిశీలించిన ఎస్పీ ప్రజలకు మరింత మెరుగైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని కోరారు. మహిళల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించేలా స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని, స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితురాలిని గౌరవంగా, సానుభూతితో పలకరించి ధైర్యం చెప్పాలని సిబ్బందికి మార్గదర్శనం చేశారు. రాత్రివేళల్లో మరియు అత్యవసర సమయాల్లో మహిళల రక్షణ కోసం డయల్ 100/112 షీ టీమ్స్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ . వెంకటేశం, ఎస్సైలు, సబ్-ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అందని ద్రాక్షగా మారిన రైతు బీమా పథకం

**జిల్లేడ్ చౌదరిగూడ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం రైతులకు సంక్షేమ పథకాలు అందిస్తోంది ఇందులో భాగంగా రైతులకు రైతు బీమా చెల్లిస్తున్నారు రైతు బీమా పథకం దరఖాస్తుకు ప్రభుత్వం వ్యవసాయ అధికారులు కొన్ని షరతులు పెట్టారు. ఈ షరతులు వారికి గుదిబండగా మారాయి రైతు బీమా పథకానికి లబ్దిదారులు దూరమవుతున్నారు
ఈ పథకానికి ముఖ్యంగా ప్రభుత్వ అధికారుల జామీను తో పాటు వారి యొక్క వేతన రాశీదు పెట్టాలని షరతులు పేటడం తో రైతులకు అధికారులు ఎవరు సహకరించకపోవడంతో రైతు బీమా వద్దులుకోనే పరిస్థితి తలెత్తిందనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలో చౌడపురం సత్యమ్మ అనే ఓ రైతు కుటుంబ సభ్యులు దరకస్తూ చేసుకోగా వారికి ప్రభుత్వ అధికారి జామీను తప్పనిసరి అని ప్రభుత్వ అధికారి అనడంతో తెలిసిన అధికారుల వద్దకు తిరిగి అలిసిపోయి ఎవరు సహకరించడం లేదని రైతు బీమా రాదని నిరాశతో ఆవేదన వ్యక్తం చేశారు . ఇలాంటి షరతులను తొలగించి రైతులకు రైతు బీమా పథకం అందేలా కృషి చేయాలని లబ్దిదారులు కోరుతున్నారు.

## అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సహాయ సహకారాలు అందిస్తా

**మర్పల్లి ఆగస్టు 04 (జనంసాక్షి):** అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా సహాయ సహకారాలు అందిస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు గ్రామాల్లో విద్యుత్ కు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఇళ్ల పైనుండి ఉన్న విద్యుత్ తీగలు తొలగించాలని అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. మర్పల్లి గ్రామ సర్పంచ్ రామేశ్వర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలలో వలస నివారించేందుకు గత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్టలు పన్నుతుందని అన్నారు. భూగర్భ జలాలను పెంచేందుకు రైతులు ఇంటికి ఒక ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించిందన్నారు. కొత్తగా పింఛన్ కోసం వేచి చూస్తున్నా వారందరికీ ప్రభుత్వం ఆగస్టు 15 తర్వాత కొత్త పింఛన్లను ఇవ్వనుంది అన్నారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లును ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధీర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి మోహన్ కృష్ణ, ఎంపీడీవో శాంతమ్మ, డిప్యూటీ తహసిల్దారు పరశురాములు, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, మండల అధికారులు, సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ నగర్‌లో ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు

**కాప్రా , ఆగస్టు 4 (జనం సాక్షి) :**



కాప్రాలోని గాంధీనగర్‌లో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. సందర్భంగా సోమ వారం ఫలహారపు బండి ఊరేగింపు కన్నుల పండువగా నిర్వహించడం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హాజరై ఫలహారపు బండి ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆశాడమాసంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించు కోవాలని, ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సుభిక్షంగా ఉండాలని అమ్మ వారిని ప్రార్థించానన్నారు. మాజీ కార్పొరేటర్ శ్రీ స్వర్ణరాజ్ శివమణి బోనాల పండుగను ప్రజలు ఐక్యమంత్యంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని, శాంతిభద్రతలతో ఫలహారపు బండ్లు ఐక్యమంత్యంగా ఘనంగా ఊరేగించాలన్నారు. అతిథులుగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ సీతారామ్ రెడ్డి మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీ విఠల్ నాయక్, డైరెక్టర్ పూర్ణయాదవ్, కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ తన్నీరు శ్రీహరి, వంపుగూడ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ అనూప్ రాజ్(టిల్లు యాదవ్)గారు, కుషాయిగూడ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ కౌకుంట్ల ప్రకాష్ రెడ్డి, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బి శివరామ కృష్ణ,బీజేపీ జిల్లా నాయకులు శ్రీ రజనీకాంత్ రెడ్డి, గాంధీనగర్ యూత్ అసోసియేషన్ల అధ్యక్షులు అధ్యక్షులు ఎన్ మహేష్ జి సత్యనారాయణ (కాంగ్రెస్ నాయకులు) గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గాంధీనగర్ యూత్ అసోసియేషన్ల ప్రతినిధులు ఎన్ దశరథ్, జి బాలయ్య, జి నర్సింహా పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో పారదర్శక పాలనకు ప్రాధాన్యం

**శేరిలింగంపల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి):**
శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ప్రజలకు జవాబుదారీతనం, పారదర్శకతతో కూడిన పాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ స్పష్టం చేశారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జోన్ పరిధిలోని అన్ని కీలక విభాగాల అధికారులతో అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యలు, ప్రజా సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయా సర్కిళ్ల అధికారులు తమ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన నారాయణ్ అమిత్ వివిధ శాఖల్లో పేరుకుపోయిన పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించి, నిర్ణీత గడువులో క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు.
జోన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు, నిధుల వినియోగంపై సమీక్ష నిర్వహించిన ఆయన, సిబ్బంది జీతాల చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అర్బన్ బయోడైవర్సిటీ కార్యక్రమాల కింద పార్కుల అభివృద్ధి, మొక్కల సంరక్షణ, పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల పనుల పురోగతిని సమీక్షించిన కమిషనర్, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన 'బిల్డ్ నౌ' దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని, ఫాగింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య, పారిశుధ్య విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేసి, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని నారాయణ్ అమిత్ అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్, జోనల్ సిటీ ప్లానర్, అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు, ఫైనాన్స్ అడ్వైజర్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, వైద్యాధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి శిశువుకు తల్లిపాలే అమృతం

### జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి




**రంగారెడ్డి, ఆగస్టు 4 (జనంసాక్షి)**పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలే అమృతం వంటివని జిల్లా అదనప కలెక్టర్ డాక్టర్ కిరణ్మయితెలిపారు. ఈనెల 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే రంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలు అందించడం అత్యంత అవసరమని తెలిపారు. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత రెండు సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ కాలం వరకు తల్లిపాలను కొనసాగిస్తూ, వయస్సుకు తగిన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా వ్యాధినిరోధక శక్తిని పెంపొందించి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు దోహదపడతాయని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాముఖ్యతపై సమాజంలో మరింత అవగాహన పెంపొందించేందుకు ఆరోగ్య శాఖ విస్తృత కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రతి గర్భిణీ, బాలింతకు తల్లిపాలపై సరైన అవగాహన కల్పించడం ద్వారా శిశు మరణాలను తగ్గించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ అనూరాగిణి రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి శ్రీమతి శాంత శ్రీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీబా హయత్, సీడీపీవో కవిత మాట్లాడుతూ తల్లిపాల వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికీ కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించి, ప్రతి తల్లి తప్పనిసరిగా శిశువుకు తల్లిపాలను అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల, ఏరియా ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్లక్ష్యం వద్దు

### ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**రంగారెడ్డి, ఆగస్టు 4 (జనంసాక్షి)**సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్-సర్) ప్రక్రియను క్షేత్రస్థాయిలో మరింత సీరియస్‌గా తీసుకుని పని చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ నేతలతో వరుస సమీక్షలు జరుపుతున్న ఆయన.. సోమవారం 'ఏ' బ్లాక్ నేతలతో సమావేశం నిర్వహించగా, మంగళవారం 'బీ' బ్లాక్ నాయకులతో సమీక్ష నిర్వహించారు. 'బీ' బ్లాక్ పరిధిలోని అబ్దుల్లాపూర్ మెట్ మండలం, తుర్కయంజాల్, తొర్రూర్, పెద్దఅంబర్ పేట్, కుంట్లూర్ డివిజన్లకు చెందిన బీఎల్ఏలు, సూపర్ వైజర్లు, కాంగ్రెస్ నాయకులతో తొర్రూర్ లోని క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎస్ఐఆర్ గడువు పొడిగింపు నేపథ్యంలో ఇప్పటి వరకు చేసిన కసరత్తు, ఫలితాలు, క్షేత్రస్థాయి వాస్తవాలను చర్చించారు. ఎస్ఐఆర్ పై పీసీసీ ప్రత్యేకంగా నియమించిన చైతన్యతో కలిసి ఎమ్మెల్యే ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలు, బడుగు, బలహీనవర్గాల ఓట్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని నిర్దేశించారు. పార్టీ ఓటర్లను కాపాడటంలో విఫలమైతే ఏ హోదాలో ఉన్నవారిపైనైనా చర్యలకు పార్టీ అధిష్ఠానం హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఎక్కడ కూడా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించవద్దని చెప్పారు. కిందిస్థాయి వరకు అందరూ ఓట్లు కాపాడుకోవడంపైనే దృష్టి సారించాలని తెలిపారు. ఓటర్లతో సమన్వయం చేసుకొని గడువులోగా ప్రక్రియ పారదర్శకంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ కోసం బూత్ లెవెల్ అధికారులకు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. బూతుల వారీగా సమన్వయం చేసుకొని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### ఉప్పల్‌లో వనమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, ఆగస్టు 4 (జనం సాక్షి):** పర్యావరణ పరిరక్షణ, సుస్థిర పట్టణాభివృద్ధి సందేశాన్ని బలోపేతం చేస్తూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉప్పల్‌లో నిర్వహించిన వనమహోత్సవ మొక్కల నాటే కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి (ఐఏఎస్), జోనల్ కమిషనర్ రాధికా గుప్తా (ఐఏఎస్)తో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, ఇది ప్రతి పౌరుడి సామూహిక బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాలు లేదా స్థానిక సంస్థల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాల్సిన సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. మొక్కలు నాటడం తొలి అడుగు మాత్రమేనని, అవి పెద్ద చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. వేగంగా జరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో పచ్చని ప్రదేశాలను కాపాడుకోవడం అత్యంత అవసరమని ఎమ్మెల్యే అన్నారు. నగరాన్ని మరింత పచ్చగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు పౌరులు, విద్యాసంస్థలు, నివాస సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ రాధికా గుప్తా మాట్లాడుతూ, ఇళ్ల వద్ద, పాఠశాలల్లో, బహిరంగ ప్రదేశాలు, కాలనీల పార్కుల్లో మొక్కలు నాటి ప్రభుత్వ హరిత కార్యక్రమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.
ఈ వనమహోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ పట్ల తమ నిబద్ధతను చాటిచెప్పారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం




**హయత్ నగర్, ఆగస్టు 4 (జనం సాక్షి)**యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హయత్ నగర్, సూర్య నగర్ కాలనీ, రోడ్ నెం.4 లోని శ్రీ సాయి తేజస్వి పాలి క్లినిక్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్, మెడ్‌ప్లస్ ఫార్మసీ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు జక్కి వీరస్వామి తెలిపారు. ఈ శిబిరం తేదీ: 05-08-2026, బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగనుంది. శిబిరంలో గుండె సంబంధిత సమస్యలను గుర్తించేందుకు రక్తపోటు (బీపీ), షుగర్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. డాక్టర్ కన్సల్టేషన్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అవసరమైన వారికి 2డీ ఎకో పరీక్షను సైతం ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, అనుమానం ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# ప్రజల ఆరోగ్యం పట్ల అధికారుల నిర్లక్ష్యం

### కుమ్మరి కుంటను పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, ఆగస్టు 4 (జనం సాక్షి)**హయత్‌నగర్ లోని కుమ్మరి కుంట చెత్తాచెదారం, మురుగు నీటితో నిండిపోయి దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు విపరీతంగా పెరిగి పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయన కుమ్మరి కుంటను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన సంబంధిత అధికారులు కుమ్మరి కుంట విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. కుంటలో పేరుకుపోయిన చెత్త, నిల్వ ఉన్న మురుగునీటి కారణంగా దుర్వాసనతో పాటు దోమల బెడద తీవ్రంగా పెరిగిందన్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతున్నప్పటికీ అధికారులు ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కుమ్మరి కుంటలో పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించాలని, ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే కుంట పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కుమ్మరి కుంట సమస్యపై అత్యవసర చర్యలు చేపట్టి, పరిసర కాలనీల ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# కార్మికుల న్యాయమైన డిమాండ్లనుపరిష్కరించాలి

### కార్మికులకు మద్దతు తెలిపిన రాగిడి లక్ష్మారెడ్డి



**నిజాంపేట్ ఆగస్టు 4 (జనం సాక్షి):**జీడిమెట్ల పరిధిలోని ఏం టి ఏ ఆర్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఈ ఓ యు కంపెనీ లో గత ఐదు రోజులు గా కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులు యాజ మాన్యం ఫై నిరసన లు వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ నారాయణ తో కలిసి కార్మికుల నిరసన దీక్ష శిబిరాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ లను యాజమాన్యం పరిష్కరించాలని కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా యాజమాన్యం సైతం చర్చలు జరిపి వెంటనే పరిస్కరించాలనీ అధేశించారు.. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుంటే పెద్దఎత్తున కదలి వస్తామని తెలిపారు. ఈ సమస్య పట్ల యాజమాన్యం సానుకూలంగా స్పందిస్తూ శనివారం సంస్థ ఎండి వచ్చి చర్చలు జరిపి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ నాయకులు సుశాంత్ రెడ్డి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# స్నేహబంధానికి ప్రతీకగా డ్రైవర్ల ప్రత్యేక పూజలు

**ధారూర్,ఆగస్టు 04(జనంసాక్షి) :** మండల పరిధిలోని నాగసముందార్‌కు చెందిన డ్రైవర్లు మంగళవారం కోట్‌పల్లి ప్రాజెక్టు సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించే ఈ పూజల్లో పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్ననాటి స్నేహితులైన డ్రైవర్లు ఒకేచోట చేరి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.తమ స్నేహబంధాన్ని కొనసాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నామని వారు పేర్కొన్నారు. "స్నేహమంటే ఇదేరా"అనే సందేశాన్ని చాటిచెబుతూ స్నేహితుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు.ఈ సందర్భంగా డ్రైవర్లు తమకు, కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు కలగాలని,వృత్తిలో క్షేమం ఉండాలని కట్ట మైసమ్మ అమ్మవారిని ప్రార్థించారు.అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వడ్ల శ్రీనివాస్,దొంద్రంపల్లి శ్రీనివాస్, నరహరి, అషు,అబ్దుల్ ఖాదర్, చిన్నా,దర్జీరాజు, సమ్మి, గణేష్, శేకర్, కావాలి శ్రీనివాస్,జబ్బార్, వడ్డే ఎలాప్ప,తదితరుల పాల్గోన్నారు.

# సర్ ప్రక్రియలోని లోపాలను సరి చెయ్యాలి

## జిల్లా అడిషనల్ కలెక్టర్కు వినతి పత్రం ఇచ్చిన హైమారెడ్డి



**శామీర్‌పేట్, ఆగస్టు 4(జనం సాక్షి ) :** మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా పరిధిలోని సర్ ప్రక్రియ ముగింపు దశకి వస్తున్నప్పటికీ ఇంకా ఉన్నటు వంటి లోపాలను సరి చేయ్యాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ని కలిసి వినతి పత్రం అందజేశారు.బిఎల్ఓలు సరైన సమయానికి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాంను అందించక పోవడమేకాక ఓటర్లకు ఉన్నటువంటి సందేహాల నివృత్తిని తీర్చట్లేదని తెలిపారు.ఓటర్లకు తగు రీతిలో స్పందించకపోవడం,సర్ ఫాములను ఇంకా డివిజన్లలో ఓటర్లకు అందించలేదన్నారు. బిఎల్ఓలు గ్రామాలలో ఒక దగ్గర కూర్చుని ఓటర్లను పిలిపించుకొని సర్ ఫామ్స్ అందించటం జరుగుతుందన్నారు.ఈ సమస్యలను పరిష్కరించి బిఎల్ఓలను తక్షణమే ఓటర్లకు అందుబాటులో ఉంచే విధంగా తగు చర్యలు తీసుకొని ఓటర్లలో ఉన్నటువంటి అభద్రతాభావాన్ని నివృత్తి చేయ్యాలని హైమారెడ్డి కోరారు.మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమం ద్వారా ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకంను మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజలందరికి ఉచితంగా మహిళా శక్తి ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్.హైమారెడ్డి వ్యవస్థాపక అధ్యక్షురాలు మహిళా శక్తి మహిళా సంఘం, బిజెపి రాష్ట్ర నాయకులు, రమేష్ అంబటి ట్రెజరర్,మహిళా శక్తి మహిళా సంఘం, బిజెపి నాయకులు ఆంజనేయులు ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, ఆర్తి, నందినిలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫాంలు, షూస్ పంపిణీ

**కొడంగల్ ,ఆగస్టు 04 (జనం సాక్షి) :** కొడంగల్ మండలం ఉడిమేశ్వరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సర్పంచ్ కె. శ్రీనివాస్ ఆద్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాంలు, షూస్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్, ఆగస్టు4(జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్లలో ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి వివిధ కాలనీల్లోని అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాల ఊరేగింపులో భక్తులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, భక్తిభావానికి ప్రతీక అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి గ్రామం, కాలనీ అభివృద్ధే తమ లక్ష్యమన్నారు.ఈ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ.. కార్తీక్ రెడ్డి నాయకత్వంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమేష్ ముదిరాజ్, రాము యాదవ్, రాఘవేందర్ యాదవ్, రాజేష్ యాదవ్, కార్మిక శాఖ విభాగ్ అధ్యక్షుడు ఉప్పల్ శ్రీను, ప్రవీణ్, మైసి రెడ్డి, వెంకటరమణ, సునీల్, మహేష్, సమ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అఖిల్, నిఖిల్, నితిన్, చిరు, పవన్, అనిల్, చిన్న, కొన్ని, సోను, దీపు, గాంధీ, పవన్, చింటూ తదితర స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా జేపిఆర్ ఇన్‌ఫ్రా కార్యాలయ ప్రారంభం

## రఘువీర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ప్రముఖుల సందడి

**ఎల్బీనగర్ ఆగస్టు 4 (జనం సాక్షి) :** ఎల్‌బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ విజయశ్రీ కాలనీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి నూతన జేపిఆర్ ఇన్ఫ్రా కార్యాలయాన్ని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం రఘువీర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించగా, ప్రజాప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.







# జేపీఎల్ కన్వెన్షన్‌లో జేబుదొంగల ముఠా అరెస్ట్

## ఇద్దరు నిధితులను అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

**మొయినాబాద్,ఆగస్టు 04, జనంసాక్షి:** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి జేబుదొంగతనానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేశారు. ఆదివారం జేపీఎల్ కన్వెన్షన్లో జరిగిన కార్యక్రమానికి హాజరైన హైతాబాద్ గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడు కావలి మల్లేష్ జేబులో నుంచి గుర్తుతెలియని వ్యక్తి రూ.14,800 నగదును అపహరించాడు. ఫిర్యాదుదారుడు ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.455/2026, సెక్షన్ 303(2) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌లు, సాంకేతిక ఆధారాలు మరియు ఇతర సమాచారాన్ని విశ్లేషించి, సోమవారం నాడు లంగర్‌హౌస్ బస్‌స్టాప్ సమీపంలో నిందితుడు మొహమ్మద్ షకీల్ అలియాస్ లంగ్డా అలియాస్ మోటాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి మిగిలిన రూ.6,600 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితుడు గతంలో హైదరాబాద్ నగరంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలు, జేబుదొంగతనాలు మరియు చైన్ స్నాచింగ్ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోంది. మొయినాబాద్ పోలీసులు వెల్లడించారు.

**మరో ఘటనలో రూ.10 వేలు చోరీ :** మరో ఘటనలో బాధ గోపాల్ జేబులో నుంచి పదివేల రూపాయలు చోరీ గురయ్యాయి. తెలియదు దారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, దేవరకొండ ప్రాంతానికి చెందిన దుర్గారావు అలియాస్ శ్రీను అనే నిధితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ. 4,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. అతనికోసం గాలింపు చర్యలు చేపట్టామని, నిందితుడిని కోర్టులో హాజరుపరచగా కేసు కేసు దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

# నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యం

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, ఆగస్టు 4 (జనం సాక్షి ) :** నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్, కృష్ణానగర్, తిరుమలనగర్ కాలనీలలో రూ.1.16 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బాక్స్ డ్రైన్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ, ఉప్పల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ, డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి విశేష సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం వేణుగోపాల్, ఏజీఎం రోహిత్, ఏఈ స్పందన, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, మల్లేష్ గౌడ్, మల్లారెడ్డి, దేవిరాజ్, జంపాల్ రెడ్డి, సత్తిరెడ్డి, నరసింహ గౌడ్, నవీన్ గౌడ్, బాలయ్య గౌడ్, అంజయ్య గౌడ్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, రాజు, రామకృష్ణ, చక్రవర్తి, కిరణ్, శేఖర్ గౌడ్, శివ, కోటి రెడ్డి, నరసింహ గౌడ్, బాల్ రెడ్డి, కామేశ్వరరావు, కృష్ణమోహన్, శ్రీనివాస్, మురళీ ప్రసాద్, రామ్ రెడ్డి, మాధవరావు, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, మాలాద్రి, సుబ్బారెడ్డి, నారాయణ రెడ్డి, శంకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, మూర్తి, వెంకటేశ్వరరావు, ఆర్టీసీ గౌరీశంకర్, గౌరీశంకర్, దండెం నరేందర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మూడు రోజులుగా గ్రామ ఎల్లమ్మ, పోచమ్మ, ఊరడమ్మ జాతర మహోత్సవం

### లింగంపల్లి గ్రామ సర్పంచ్ శోభ పరమేశ్వర్



**నవాబుపేట్ ఆగస్టు 4 ( జనం సాక్షి)**నవాబుపేట్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో మంగళవారం సర్పంచి శోభ పరమేష్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ, పోచమ్మ ఊరడమ్మ, గ్రామస్తులు అందరూ రంగ రంగా వైభవంగా గ్రామస్తులంతా బోనాలు తయారుచేసి గ్రామమంతా తిరిగి ఎల్లమ్మ పోచమ్మ గుడి వద్ద బోనాలు గుడి చుట్టూ ప్రదర్శనలు చేసి అమ్మ వాళ్లకు ఓడి బియ్యం పూజలు చేశారు. అనంతరం మహిళలు నెత్తిన బోనంతో ఊరేగింపుగా డప్పు సప్పులతో పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి చుట్టూ ప్రదర్శనలు చేసినైవేద్యంగా బోనాలను సమర్పించారు. పాడి పంటలతో పల్లెలు పచ్చగా ఉండాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. గ్రామంలోనే ప్రజలందరూ ఆత్మ బంధువులతో అమ్మవారికి పూజలు నిర్వహించి కోడి పుంజులను, మేక పోటేలను అమ్మవారికి సమర్పించారు. గ్రామంలోని మహిళలందరూ అమ్మవారి సమర్పణతో గ్రామమంతా ఊర్లోనే ఉండి మొక్కులు తీసుకుంటున్నారు. పంట పొలం పక్కనపెట్టి గ్రామాలకు బంధువులను తీసుకువచ్చి మొక్కులు తెచ్చుకున్నారు. పోతురాజులు విన్యాసాలు ఘనంగా నిర్వహించి గొర్య పొట్టిలను గావ్ గొర్రెను బట్టి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమం లో సర్పంచి శోభ పరమేశ్వర్ ఉపసర్పంచి ప్రవీన కుమార్, పంచాయితీ వార్డు సభ్యులు, బంధువులు యొక్క బోనాలు పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటూ గ్రామంలోని ప్రజలందరూ ఆనంద ఉత్సవాలలో నిండిపోయినారు. గ్రామ పెద్దలు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు యువజన సంఘాల నాయకులు డ్వాక్రా మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యువత పార్టీకి అత్యంత కీలకం:రాష్ట్ర యువజన అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి



**తాండూరు అగస్టు 4(జనంసాక్షి)**యువతతెలంగాణ రక్షణ సేన పార్టీకి అత్యంత కీలకమని రాష్ట్ర యువజన అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి పేర్కొన్నారు.మంగళవారం తాండూరు పట్టణం అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన టీఆర్ఎస్( తెలంగాణ రక్షణ సేన ) పార్టీ జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, జూకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజశేఖర్, తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరమణి తదితర నాయకులు హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడిన టీఆర్ఎస్ పార్టీ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తోందన్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ శ్రేణులు మరింత ఐక్యంగా పనిచేసి ప్రజల సమస్యలపై పోరాటాన్ని ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర యువజన అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి మాట్లాడుతూ యువత పార్టీకి వెన్నెముకలాంటివారని, గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండాలని సూచించారు .మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, టీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. జూకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజశేఖర్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కార్యకర్తలే అసలైన బలమని, రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కోరారు. తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరమణి మాట్లాడుతూ, తాండూర్ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పార్టీకి ప్రజల మద్దతును మరింత పెంచేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా విభాగం, స్థానిక నాయకులు దీపక్ రెడ్డి, శ్రీనివాస్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## యాచారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యక్తిపై దాడి



**యాచారం, ఆగస్టు 04(జనం సాక్షి )**రంగారెడ్డి జిల్లా యాచారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ వ్యక్తిపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 3 న మధ్యాహ్నాం 3.30 గంటల సమయంలో యాచారం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొర్ర రాజు ఎంఆర్వో కార్యాలయం వద్ద ఉన్న సమయంలో మిటాబాయి నరేందర్ రెడ్డి, మిటాబాయి శేఖర్ రెడ్డి, మలె అనంతరెడ్డి, మలె నారాయణరెడ్డి మరియు మరో ఇద్దరు వ్యక్తులు కలసి ఆయనపై దాడికి దిగారు. అంతేకాకుండా కులం పేరుతో దూషిస్తూ అవమానించారని బాధితుడు పేర్కొన్నారు. దీనిపై బాధితుడు కొర్ర రాజు అదే రోజు సాయంత్రం 5.30 గంటలకు యాచారం పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు తహసీల్దార్ కార్యాలయంలో స్వయంగా విచారణ చేపట్టారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ అనంతరం నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ విచారణ కార్యక్రమంలో సీఐ నందీశ్వర్ రెడ్డి, ఎస్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

### టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలి జనార్దన్



**కొడంగల్ ,ఆగస్టు 04 (జనం సాక్షి):** బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్ అమలు చేసి సామాజిక న్యాయం చేయాలని టీఆర్ఎస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలి జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం కొడంగల్ పట్టణంలో నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడాడు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 6వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న సంకల్ప సభకు పార్లమెంట్ పరిధిలోని వేలాది మంది ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారని తెలిపారు. విద్య, ఉపాధి, రైతులకు న్యాయం, బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించడం ఈ సభ ప్రధాన ఎజెండా అని స్పష్టం చేశారు.దేశంలో బీసీల జనాభాకు అనుగుణంగా 50 శాతం రిజర్వేషన్ అమలు చేసినప్పుడే వారికి నిజమైన సామాజిక, రాజకీయ న్యాయం జరుగుతుందని అన్నారు. అలాగే పార్టీ సంస్థాగత నిర్మాణంలో బీసీలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వివిధ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు.

## చైర్మన్ నియామకం స్వాగతం... నిధులు ఎక్కడ



**ఎల్బీనగర్ ఆగస్టు 4 (జనం సాక్షి)**తెలంగాణ ప్రభుత్వం బ్రాహ్మణ పరిషత్ చైర్మన్‌గా బసవరాజు శ్రీనివాస్‌ను నియమించడాన్ని బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షుడు డా. ఏవీఆర్ మూర్తి స్వాగతించారు. ఈ నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అయితే, పరిషత్‌కు తగిన నిధులు లేకపోతే చైర్మన్ సమర్థవంతంగా ఎలా పనిచేయగలరని ఆయన ప్రశ్నించారు. విదేశీ విద్యా నిధుల బకాయిలు విడుదల కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పేద బ్రాహ్మణులకు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాల అమలులోనూ జాప్యం కొనసాగుతోందని పేర్కొన్నారు.బ్రాహ్మణుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం పరిషత్‌కు తక్షణమే నిధులు కేటాయించాలని, అన్ని వర్గాల మాదిరిగానే బ్రాహ్మణ సంక్షేమంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని డా. ఏవీఆర్ మూర్తి విజ్ఞప్తి చేశారు

## నవాబుపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999 సంవత్సరం పదవ తరగతి తోటి న్యాలం ప్రభాకర్ రోడ్డు ప్రమాదంలో మృతి

### స్నేహితులు కుటుంబానికి 25000, రూ ఆర్థిక సహాయం..



**నవాబుపేట్ ఆగస్టు 4 (జనం సాక్షి )** నవాబుపేట్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 సంవత్సరంలో విద్యార్థిని విద్యార్థులు అందరూ ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా ఫ్రెండ్షిప్ డే రకరకాలుగా పూర్వ విద్యార్థులందరూ ఏకతాటిపై నిలుస్తున్న సందర్భంగా నవాబుపేట్ మండల కేంద్రంలోని న్యాలం ప్రభాకర్ గత పది సంవత్సరాల నుండి ఆర్టీసీలో మెకానిక్ పనిచేస్తున్న సందర్భంగా జూలై 31 శుక్రవారం నాడు నవాబుపేట్ పనిచేరు ఆర్టీసీ బస్టాండ్ కు డ్యూటీ కి వెళుతున్న సందర్భంగా సంగారెడ్డి జిల్లా పరిధిలోని బిడియల్ మెయిన్ రోడ్ పై లారీ యాక్సిడెంట్లో ప్రభాకర్ మృతి చెందినాడు సమాచారం తెలిసిన వెంటనే తోటి పదవ తరగతి మిత్రులందరూ మృతి చెందిన ప్రభాకర్ వద్దకు చేరి బోరున గెలిపించారు. 1999 బ్యాచ్ కి చెందిన మంచి మిత్రుడు అయినటువంటి ప్రభాకర్ ను కోల్పోయామని వారి కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారిని ఆదుకునే విధంగా సాయి శక్తుల కృషి చేశామని మిత్రులు పేర్కొన్నారు. ప్రభాకర్కు ఇద్దరు కుమారులు ఉండగా భార్య మమత వారి కుటుంబానికి 25 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మృతి చెందిన న్యాలం ప్రభాకర్ కుటుంబ సభ్యులు తల్లి రుక్కమ్మ, అన్న గోపాల్, భార్య మమత, ఇద్దరు కుమారుల కుటుంబ సభ్యులకు అందించారు. ఇలాంటి మిత్రులకు ఎవరికి ఏది ఏమైనా సాయి శక్తులం అందరం కలిసి మిత్రులందరికీ చేతులకు బాధలు ఉంటామని వారు కుటుంబానికి ధైర్యం సాహసాలు అందించారు. ఈ కార్యక్రమంలో వట్టిమీనపల్లి రాజ్ కుమార్, దాదాపూర్ జంగయ్య, తోటి మిత్రులందరి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని అందించినారు ఈ కార్యక్రమంలోమృతుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి రాజకీయాల కతీతంగా తన వంతు కృషి చేస్తా

**శాసనసభాపతి గడ్డం ప్రతాప్ కుమార్**

**మోమిన్ పేట ఆగస్టు 4 (జనం సాక్షి) :** జిల్లా అభివృధి కోసము పార్టీల కతీతంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం మోమిన్ పెట్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశము హాలు నందు జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ మండల స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సరైన, పూర్తి స్థాయి సమాచారం అందించాలని, శాఖల వారిగా సమస్యలు, అవసరమైన పనుల వివరాలను అందిస్తే సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజలు ఫోన్ చేస్తే తప్పని సరిగా స్పందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎల్లప్పుడూ బాధ్యతగా వ్యవహరించి వాటిని పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు భారీగా నిధులను మంజూరు చేస్తున్నదని, విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చేందుకు ప్రతి నియోజకవర్గంలో రెండు వందల కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఏర్పాటు చేస్తుందని, ప్రతి మండలంలో ఒక పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ ఏర్పాటుతో పాటుగా గ్రామాల నుండి బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించాలని, తద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పోరేట్ విద్యను అందించాలనే ఆశయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు.



ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసే విదంగా ప్రజలను చైతన్యవంతం చేయాలని వర్షాలు కురిసినప్పుడు నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోనికి ఇంకిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. దేశంలో కరువు పరిస్థితులు నెలకొంటున్నాయి. అయితే అతివృష్టి లేకపోతే అనావృష్టి. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటుగా, భూగర్భజలాలు పెంపొందించాలన్నారు. స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా, సోనియా గాంధీ యుపిఏ చైర్మన్‌గా ఉన్నప్పుడు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు లేని కాలంలో కూలీలు వలసలు పోకుండా స్థానికంగానే ఉపాధి కల్పించడానికి పనికి ఆహార పథకాన్ని ప్రారంభించి, దానిని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంగా మార్చారు. ఈ పథకంలో వంద శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే ఇచ్చేది. దీనితో గ్రామాలలో ప్రజలకు ఉపాధి దొరికింది. తదనంతరం గ్రామాలలో మిగిలిన అభివృద్ధి పనులకు విస్తరించారన్నారు. ప్రతి గ్రామం నుండి మండలం వరకు రోడ్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశారని, ఒక్కో గ్రామానికి ప్రత్యేకంగా కోటి రూపాయలు నిధులు మంజూరు చేసి, 200 యూనిట్లు కరెంటు ఇచ్చి, మహిళలకు ఉచిత బస్సులు ఏర్పాటు చేసి, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి, మహిళలను లక్షాధికారులనుచేయాలన్నదే మా లక్ష్యమన్నారు. వికారాబాద్ జిల్లాకు సాగు, తాగునీరు అందించడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి పథకాల ద్వారా ప్రయత్నాలు చేశాను. అయితే గత ప్రభుత్వం పదేళ్ళు ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది, పనులు జరుగలేదు. అయితే ప్రస్తుతం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నీళ్ళు దగ్గరి ప్రాంతం వరకు వస్తున్నాయి, మాకు కూడా ఇప్పించాలని కోరగా ముఖ్యమంత్రి సరే అన్నారని , వికారాబాద్ ప్రాంతానికి సాగు, తాగు నీరు ఇచ్చే బాధ్యత నాదేనని ఈ సందర్భంగా అన్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై సర్పంచులు, వార్డు మెంబర్ లు పూర్తి అవగాహనా కలిగి ఉండాలన్నారు.మండల, గ్రామా పంచాయతి స్థాయి సమావేశాలు నిర్వహించి, ప్రజల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి గ్రామ ,మండల స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే గ్రౌండ్ లెవల్లో సమస్యలు తెలుసు కోవచ్చన్నారు. ఎలినినో వల్ల రైతులు పంట నష్ట పోకుండా కూరగాయలు, ఆయిల్ ఫార్మ్ పంటలపై దృష్టి సారించేలా రైతులకు అవగాహనా కలిపించాలన్నారు. గ్రామం లో మంచినీటి సమస్య, విద్యుత్, పాత బిల్డింగ్ లు, ఆరోగ్యము పై ఉన్న సమస్యలను తెలుసుకొని, అధికారులు అందుబాటులో ఉండి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశములో మార్కెట్ కమిటి చైర్మెన్ మహేందర్ రెడ్డి, జాడ్ పిసిఇఓ సుధీర్, తహసిల్దార్ మునీరుద్దీన్, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కోసిగి సురేందర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్ మండల స్థాయి అధికారులు,సర్పంచులు, వార్డ్ మెంబర్లు, పంచాయతి సెక్రటరీలు గ్రామ, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కొడంగల్ టౌన్ కాంగ్రెస్ ఇన్చార్జిగా మహమ్మద్ నసీరుద్దీన్ - ప్రతి వార్డులో పర్యటిస్తా

**పెద్దేముల్, ఆగస్టు 04 (జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేసే క్రమంలో జిల్లా నాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొడంగల్ టౌన్ ఇన్చార్జిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ నసీరుద్దీన్ను నియమించారు. ఈ సందర్భంగా నసీరుద్దీన్ మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం, జిల్లా నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయను. కొడంగల్ టౌన్ లోని 18 వార్డుల్లో పర్యటించి, ప్రతి బూత్‌లో కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేసి అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటా మని అన్నారు. అలాగే వార్డుల్లో యువకులు, మహిళలు, సీనియర్ నాయకులను కలుపుకుని పార్టీని బలోపేతం చేస్తాంఅని తెలిపారు. ఏ ఎన్నికలు వచ్చినా కొడంగల్ టౌన్ నుండి, అలాగే కొడంగల్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ అందించడమే మా లక్ష్యం. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తాం అని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో టౌన్ లోని అన్ని వార్డులను కైవసం చేసుకోవడమే తన టార్గెట్ అని స్పష్టం చేశారు. కొడంగల్ టౌన్‌లోని సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మెలిసి ఉంటూ, ఎవరిని కాదనకుండా అందరినీ కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకై గోడపత్రిక ఆవిష్కరణ

**శేరిలింగంపల్లి, ఆగస్టు 04 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మదీనాగూడ పరిధిలోని టిఆర్ఎస్ పార్టీ శేర్లింగంపల్లి నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం జరిగిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం టిఆర్ఎస్ నాయకులు భారీగా తరలివచ్చారు. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గ ఇన్చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ టిఆర్ఎస్ నాయకులతో కలిసి గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన సభలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొన్ని వర్గాలదే పెత్తనం కొనసాగుతుందని, అధికారం, ప్రభుత్వం వారిది కావడంతో నిర్ణయాలన్నీ కొద్ది మందికి మాత్రమే అనుకూలంగా ఉంటున్నాయని, తద్వారా తెలంగాణ రాష్ట్రంలో అధిక జనాభా శాతం ఉన్న ప్రజలకు న్యాయం జరగడం లేదని, ఈ నేపథ్యంలోనే తాము మదీనాగూడ లోని పార్టీ కార్యాలయంలో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధి



కేవలం టిఆర్ఎస్ పార్టీ తోనే సాధ్యపడుతుందని, దొరల పార్టీలు, కుటుంబ పార్టీలతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని చంద్రశేఖర్ ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్ర సామాజిక న్యాయం కోసం టిఆర్ఎస్ పార్టీ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తుందని, సామాన్యుడి లక్ష్యంగా పరిపాలన కొనసాగాలన్నదే పార్టీ అంతిమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విష్ణు, కుమార్, అస్లాం, దయానంద్, ప్రవీణ్, యాదగిరి, వలి, స్వామి గౌడ్, సూర్య ప్రకాష్, చందు, ఆసిఫ్,రాం భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బోనాల ఉత్సవాలపై సమీక్ష సమావేశం

**మల్కాజిగిరి ఆగస్టు 24 (జనంసాక్షి) :** అధికారులు సమన్వయంతో పనిచేసి బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని మల్కాజిగిరి ఏసిపి యాదగిరి రెడ్డి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జాకియ సుల్తానా అన్నారు. శుభం ఫంక్షన్ హాల్ లో ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో బోనాల ఉత్సవాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.బోనాల ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుత వాతావరణంలో వైభవంగా నిర్వహించాలని మల్కాజిగిరి పోలీసులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అధికారులు ఉత్సవాల ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించి, పలు సూచనలు జారీ చేశారు. పండుగ రోజుల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, పార్కింగ్ వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆలయాల వద్ద, ఊరేగింపు మార్గాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టి తాగునీటి సదుపాయం అందించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పోలీసులు, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, విద్యుత్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా,ఏసీపీ. యాదగిరిరెడ్డి,సీఐ.విజయ్‌కుమార్, డిఐ చల్లా శ్రీను, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహాతో పాటు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## యువతకు ఆదర్శం.. నాయకత్వానికి నిదర్శనం

**జక్కిడి రఘువీర్ రెడ్డి**

**హయత్ నగర్, ఆగస్టు 4 (జనం సాక్షి):** యువతకు ఆదర్శంగా నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్న యువ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న రఘువీర్ రెడ్డి మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. మన్సూరాబాద్ డివిజన్‌లో యువ నాయకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న రఘువీర్ రెడ్డి యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారని పలువురు పేర్కొన్నారు. నాయకత్వ లక్షణాలతో పాటు సేవాభావాన్ని కలిగి ఉండటం ఆయన ప్రత్యేకతగా అభివర్ణించారు. రఘువీర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు నిండు నూరేళ్ల ఆయుష్షు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ప్రజాసేవలో మరింత చురుకుగా పనిచేస్తూ, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని



కోరుకున్నారు."ప్రజలే బలం.. ప్రజాసేవే లక్ష్యం" అనే స్ఫూర్తితో రఘువీర్ రెడ్డి మరింత ముందుకు సాగాలని, యువతకు మార్గదర్శకంగా నిలుస్తూ సమాజానికి మరింత సేవ చేయాలని శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు. భగవంతుడు ఆయనకు కోటి కాంతుల చిరునవ్వులతో నిండు నూరేళ్ల జీవితాన్ని ప్రసాదించాలని, ప్రతి అడుగులో విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ షిరిడి సాయి నగర్ కాలనీ (వీరన్నగుట్ట) అసోసియేషన్ అధ్యక్షులు నరసింహ యాదవ్, పులుసు రవి గౌడ్, కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.10.48 లక్షలతో పోచమ్మ ఆలయాల అభివృద్ధి

**అల్వాల్, ఆగస్టు 4(జనంసాక్షి):** యాప్రాల్ డివిజన్ కౌకూర్‌లోని భార్యాపేట్, భారతనగర్ పోచమ్మ ఆలయాల పరిసరాల్లో రూ.10.48 లక్షలతో చేపట్టిన సీసీ కాంక్రీట్ బెడ్, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బోనాల సందర్భంగా భక్తులు ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకునేలా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చొరవతో ఈ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గతంలోనూ ఆలయ నిర్మాణానికి సొంత నిధులతో సహకరించిన మైనంపల్లి, మరోసారి ఆలయాభివృద్ధికి కృషి చేసి పనులు మంజూరై పూర్తయ్యేలా చూడటంతో కాంగ్రెస్ నాయకులు, బస్తీవాసులు ఆయనకు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. భార్యాపేట్ యువకుల విజ్ఞప్తితో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ సమస్యను మైనంపల్లి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు మంజూరై వేగంగా పూర్తయ్యేలా కృషి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని, మైనంపల్లి ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న నాయకుడని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివరాజ్, బొడ్డు శ్రీనివాస్ యాదవ్, శ్రావణ్, గోమారం అంజిరెడ్డి, అల్లి మల్లేష్, ఎన్ను వెంకటరెడ్డి, అల్లి పండు, ఆసిఫుల్లా ఖాన్, అల్లి సత్యనారాయణ, సయ్యద్ అస్లాం, రజనీకాంత్, తివారి, సుబేదార్ యాదవ్, ఖలీల్, మోహన్‌రావు, జయంత్, శ్రీకాంత్, శామ్యూల్, ప్రవీణ్, భరత్, రాజ్‌కుమార్‌తో పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏన్ని సమస్యలున్నా తీర్చి దిద్దడానికి నేనున్నా

### గ్రామ సర్పంచ్ గాజులగూడ నరసింహారెడ్డి



**నవాబుపేట్ అక్టోబర్ 4 ( జనం సాక్షి)** నవాబుపేట్ మండల కేంద్రంలోని గ్రామం పంచాయతీ లో ఏ సమస్య వచ్చినా గ్రామం సర్పంచ్ కి సమాచారం ఇవ్వండి వెంటనే మండల కేంద్రంలోని ఉన్నటువంటి గ్రామ పంచాయతీ ఆవరణలో ఎన్ని సమస్యలు ఉన్నా తీర్చి దిద్దడానికి నేనున్నానంటూ గ్రామ సర్పంచి గాజులగుడం నరసింహారెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లడానికి గత వారం రోజుల నుండి భారీ వర్షం కురుస్తున్న సందర్భంగా ప్రజలు ఆస్పత్రికి వెళ్లాలంటే పూర్తిగా వర్షం పడి రోడ్డంతా బురదమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమస్యను ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారి డాక్టర్ రోహిత్ గ్రామ సర్పంచి అయినటువంటి గాజుల గూడం నరసింహారెడ్డికి సమాచారం అందించడం వెంటనే పంచాయతీ కార్మికులచే ఆస్పత్రి వెళ్లడానికి భారీ వర్షం పడుతున్న సందర్భంగా బురదగా మారిన రోడ్డును కంకర వేసి ప్రజలు ఆసుపత్రికి వెళ్లడానికి ఇబ్బందులు లేకుండా రోడ్డును పూర్తిగా కంకర వేసి రోడ్డును ఇబ్బందులు లేకుండా పోవడానికి చేశారు. డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ గత వారం 10 రోజుల నుండి ఆస్పత్రికి లోపలికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు ప్రజలు గురవుతున్న సందర్భంగా ఆ సమస్యను గ్రామ సర్పంచి నరసింహారెడ్డి కంకర బోసి సమస్యను తీర్చినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఒక కార్యక్రమాన్ని పంచాయతీ కార్మికులు ఇబ్బందులు పడకుండా ప్రజల సమస్యలు తీర్చడానికి మేమున్నామంటూ పంచాయతీ కార్మికులు తెలిపారు. గ్రామంలోని గల్లి గల్లిన వీధి వీధిన ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే గ్రామ సర్పంచికి సమాచారం ఇచ్చినట్లయితే ఆ సమస్యను తీర్చడానికి ముందుగా మేమున్నామంటూ పంచాయతీ కార్మికులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి లో ఎలాంటి సమస్యలు ఉన్న గ్రామపంచాయతీ ఆధ్వర్యములో ఉన్నందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్కడైనా ఏ సమస్య ఉంటే వెంటనే సర్పంచ్ కి సమాచారం ఇవ్వాలని సిసి రోడ్లు,వీధి దీపాలు, అండర్ డ్రైనేజీ, మంచినీటి సమస్య నవాబుపేట్ గ్రామపంచాయతీ ఆవరణలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిగా సమస్యలను సాల్వ్ చేస్తామని గ్రామపంచాయతీ కార్యదర్శి నవనీత, ఉప సర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు తదితరులు తెలిపారు.

# విలువలతో కూడిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రతి విద్యాసంస్థ కృషి చేయాలి

### బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభ ప్రద్ పటేల్



**తాండూరు అగస్టు 4(జనంసాక్షి)**విలువలతో కూడిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రతి విద్యాసంస్థ కృషి చేయాలని బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభ ప్రద్ పటేల్ పేర్కొన్నారు.తాండూర్ నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నూతన కమిటీ ఇటీవల ఎన్నికైన సందర్భంగా, బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభ ప్రద్ పటేల్మంగళవారం కమిటీ సభ్యులతో సమావేశ మయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు కేవలం విద్యాబోధన మాత్రమే కాకుండా నైతిక విలువలు, క్రమశిక్షణ, కుటుంబ బాంధవ్యాల ప్రాముఖ్యతను కూడా బోధించాలని సూచించారు. సమాజానికి బాధ్యతాయుతమైన, విలువలతో కూడిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రతి విద్యాసంస్థ కృషి చేయాలని, విద్యార్థుల మానసిక వికాసం, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడు మోహన్ కృష్ణ గౌడ్, గౌరవ అధ్యక్షుడు కీర్తి శర్మ, ఉపాధ్యక్షుడు అబ్దుల్ వహీద్, కార్యదర్శి వెంకటేశం, సంయుక్త కార్యదర్శి సునీత, కోశాధికారి రమేష్ గౌడ్, సలహాదారు సోహెల్ ఉద్దీనలను శుభ ప్రద్ పటేల్ శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్పీ ట్రస్ట్ సభ్యులు భాను, మహేష్, శేఖర్, సాయి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ డోర్ లో ఇరుక్కొని మహిళ మృతి

### లిఫ్ట్ సరిగా పనిచేయకపోవడం వల్లనే ఈ దారుణం అని భర్త ఫిర్యాదు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** ఓ మహిళ లిఫ్ట్ లోకి ఎక్కుతుండగా పొరపాటున అది కదలడంతో కాలు అందులో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలతో మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, మృతురాలి భర్త దాడి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం తనకు, తన భార్య అనసూయ(వయస్సు 43 సంవత్సరాలు)తో 2000 సంవత్సరంలో వివాహం జరిగిందని, తమకు ముగ్గురు సంతానం ఉన్నారని తెలిపాడు. కాగా మంగళవారం ఉదయం 11గంటల సమయంలో, తన మేనమామ ధాడి గోవింద్ తలకు గాయం కావడంతో చందానగర్లోని అన్నపూర్ణ ఎన్క్లేవ్, చాట్వాజ్ మెన్షన్ అపార్ట్మెంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారని తెలుసుకుని, తాను తన భార్య అనసూయతో కలిసి పరామర్శించడానికి వెళ్లినట్లు తెలిపాడు. అపార్ట్మెంట్ గ్రౌండ్ ఫ్లోర్కు చేరుకున్న తర్వాత తాను లిఫ్ట్ బటన్ నొక్కగా లిఫ్ట్ తలుపులు తెరుచుకున్నాయని, ముందుగా తాను లిఫ్ట్లోకి ప్రవేశించినట్లు తెలిపాడు. అనంతరం తన భార్య అనసూయ లిఫ్ట్లోకి ఎక్కుతున్న సమయంలో ఒక కాలు లిఫ్ట్ లోపల పెట్టి, మరో కాలును లోపలికి తీసుకువస్తుండగానే లిఫ్ట్ తలుపులు పూర్తిగా మూసుకోకముందే అకస్మాత్తుగా లిఫ్ట్ పైకి కదలడం ప్రారంభించిందని తెలిపాడు. దీంతో ఆమె లిఫ్ట్ మరియు ప్రవేశ ద్వారం మధ్య ఇరుక్కుపోయి నడుము భాగంతో పాటు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిందని తెలిపాడు. తాను సహాయంకోసం కేకలు వేయగా అపార్ట్మెంట్ నివాసితులు మరియు సమీపంలోని ఇతరులు అక్కడికి చేరుకుని అనసూయను లిఫ్ట్లో నుంచి బయటకుతీసి వెంటనే చికిత్స నిమిత్తం చందానగర్లోని అర్చనా ఆసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారని తెలిపాడు. అనంతరం తన కుమార్తె ఆమెను చికిత్స కోసం నిజాంపేటలోని హోలిస్టిక్ హాస్పిటల్కు తీసుకెళ్లినట్లు తెలిపాడు. ఈ సంఘటన అనంతరం ప్రమాదం జరిగిన సమయంలో లిఫ్ట్ మరమ్మత్తుల పనులు జరుగుతున్నాయని తనకు తెలిసిందని, లిఫ్ట్ నిర్వహణ సాంకేతిక నిపుణుడు అనిల్ కుమార్ ప్రధాన విద్యుత్ సరఫరాను నిలిపివేయకుండా అలాగే నివాసితులకు హెచ్చరికగా ఎటువంటి కాషన్ బోర్డు లేదా వార్నింగ్ బోర్డు ఏర్పాటు చేయకుండా మరమ్మత్తు పనులు నిర్వహించాడని ఆరోపించాడు. కేవలం లిఫ్ట్ టెక్నీషియన్ అనిల్ కుమార్ నిర్లక్ష్యపూరిత మరియు అజాగ్రత్త చర్యలతో పాటు అపార్ట్మెంట్ అసోసియేషన్ సభ్యులు రామ్ రెడ్డి, యోగేందర్, వెంకట్ రెడ్డి మరియు లిఫ్ట్ మెయింటెనెన్స్ కంపెనీ యజమాని నివాసితుల భద్రతను నిర్ధారించడంలో విఫలమైన నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగి తన భార్య మరణించిందని పేర్కొంటూ, బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు.



# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### అత్తాపూర్ ఇన్స్పెక్టర్ ఏ. సీతయ్య



**రాజేంద్రనగర్, ఆగస్టు4(జనంసాక్షి)**సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త మార్గాలను అనుసరిస్తూ సెల్ఫోన్లకు మెసేజ్లు, లింకులు పంపుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్తాపూర్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఏ. సీతయ్య సూచించారు. మంగళవారం చింతల్మెట్ ఎక్స్ రోడ్డులోని గౌతమ్ మోడల్ స్కూల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులకు ఓటీపీ మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు, లోన్ యాప్ వేధింపులు, ఏపీకే ఫైల్స్, పెట్టుబడుల మోసాలు, క్రెడిట్ కార్డు మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఆధార్, పాన్కార్డు దుర్వినియోగంపై అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్కాల్స్, మెసేజ్లు, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ జయరాజ్, సైబర్ వారియర్, పీవీ1 సిబ్బంది పాల్గొన్నారు.

# దళితులపై సర్పంచ్ వర్గం దాడి

### రోడ్డు విషయంలో ఇరువురి మధ్య తగాదా



**మర్పల్లి ఆగస్టు 4 (జనం సాక్షి):** తమ సొంత ఇంటి స్థలంలో రోడ్డు వేయడాన్ని అడ్డుకున్నందుకు గ్రామ సర్పంచ్ రఫీయోద్దీన్ తో పాటు ఆయన అనుచరులు తమపై దాడి చేశారని మర్పల్లి మండలం కొమ్మిశెట్టిపల్లి గ్రామానికి చెందిన ఐదులాపురం ఇందిరమ్మ మర్పల్లి పోలీసులకు వికారాబాద్ డిఎస్పి కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. తమ ఇంటి ముందు కొంత స్థలం ఉందని అందులో నుంచి రోడ్డు వేయవద్దని అడ్డుకున్నందుకు సోమవారం రాత్రి సర్పంచ్ తో పాటు ఆయన వర్గం ఇంట్లోకి చొరబడి నానా బూతులు తిడుతూ తమపై దాడి చేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా కులం తక్కువ పేరుతో పత్రికలో రాయలేని విధంగా బూతులు తిట్టినట్లు తెలియజేశారు. సర్పంచ్ వర్గీయులు చేసిన దాడిలో తమ కొడుకుతోపాటు తనకు గాయాలైనట్లు తెలిపారు. ఒక పథకం ప్రకారం తమపై దాడి జరుగుతుందని వారిపై చర్యలు తీసుకోవాలని మర్పల్లి వికారాబాద్ డిఎస్పి ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు

# ఏర్పుమళ్ళ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**బొంరాస్ పేట, ఆగస్టు 4 (జనం సాక్షి):**మండల పరిధిలోని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో విద్యార్థులు అలరించారు.విద్యార్థుల స్వయంగా బోనాలను అలంకరించి ఆటపాటలతో సందడి చేశారు.ఈ సందర్భంగా బోనాల పండుగ విశేషాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.విద్యార్థి రాజేష్ పోతురాజు వేషధారణలో అబ్బురపరిచాడు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, చైర్మన్ వసంత, ఉపాధ్యాయులు సర్దార్, ప్రశాంత్, వార్డు మెంబర్ శ్రీనివాస్, అంగన్వాడి సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.